క్లుప్తంగా

సబ్‌జైల్ తనిఖీ



సబ్‌జైల్‌లో ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న రత్నప్రసాద్

చింతలపూడి: ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, మంచి నీరు, వైద్య సదుపాయాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయంపై వారికి వివరించారు. అనంతరం వంటశాలను, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ కృపానందం, సబ్‌జైల్ సిబ్బంది, న్యాయవాది ఏసుపాదం, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి తదితరులు పాల్గొన్నారు.

మద్ది అంజన్నకు లక్షార్చన



లక్షార్చన పూజలు నిర్వహించిన అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామికి సోమవారం లక్ష తమలపాకులతో లక్షార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పీపీ సామయ్యకు సత్కారం



పీపీ సామయ్యను సత్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి: పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య సేవలు అభినందనీయమని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. పదోన్నతిపై వెళ్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్ –2 వి సామయ్యను కోర్టు ఆవరణలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు శాలువాలతో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి నాగేంద్ర ఫణిదీప్, న్యాయవాదులు నరుకుళ్ళ సత్యన్నారాయణ, పట్నాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రంలో స్థానిక మహిళలు

కామవరపుకోట: జీలకర్రగూడెంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఎంపీటీసీ కంతమనేని పుష్పరాజ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలన్నారు. సర్పంచ్ గోరింక దాసు, ఏసు వరప్రసాద్, బాలరాజు, కటాకం సత్యనారాయణ పాల్గొన్నారు.

విమానగోపుర స్వర్ణమయ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన వెలిశెట్టి మోహిరాస్కంద ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మీకోసంలో 11 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 11 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. వీధికుక్కల బెడద, భూమి సర్వే, పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని, సరిహద్దు తగాదాలు, ఆక్రమణలు, ఉద్యోగం ఇప్పిస్తానని మోసం తదితర ఫిర్యాదులు అందాయన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత తేదీ లోగా పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు.

ఎంఆర్‌పీఎస్ మండల కన్వీనర్‌గా రాజేందర్‌బాబు

బుట్టాయగూడెం: ఎంఆర్‌పీఎస్ మండల కన్వీనర్‌గా చాపల రాజేందర్ బాబు మాదిగ నియామకమయ్యారు. ఈమేరకు సోమవారం జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో రాష్ట్ర నేత విస్సంపల్లి సిద్దు మాదిగ ప్రకటించారు. ఈనెల 22వ తేదీన మంద కృష్ణ మాదిగ ఏలూరు పర్యటన కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా పడినట్లు తెలిపారు.

ఉత్సాహంగా వర్జీనియా సాగు

- గత సీజన్‌లో రికార్డు ధరలు పలికిన వర్జీనియా
- ఈ ఏడాది కూడా అలాగే ఉండాలని కోరుకుంటున్న రైతులు
- పరిమితికి మించి సాగు చేయొద్దంటున్న అధికారులు




దిప్పకాయలపాడులో నారు పెంపకం కేంద్రాన్ని పరిశీలిస్తున్న బోర్డు అధికారులు (ఫైల్), కొయ్యలగూడెం వేలంకేంద్రం పరిధిలో వేస్తున్న వర్జీనియా పొగాకు తోటలు

కొయ్యలగూడెం: గతేడాది ఊహించని రీతిలో రికార్డు స్థాయిలో వర్జీనియా ధరలు పలకడంతో ఈ ఏడాది కూడా అదే రీతిలో గిట్టుబాటు కావాలని ఆశిస్తూ రైతులు వర్జీనియా సాగుకు సన్నద్ధం అవుతున్నారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం పరిధిలో 3057 బేరన్‌లో ఉండగా 2660 మంది రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్ 2024–25కి గాను 5,349 హెక్టార్ల విస్తీర్ణంలో వర్జీనియా పొగాకు తోటలు వేయాల్సి ఉండగా నవంబర్ రెండవ వారానికి 3,589 హెక్టార్ల విస్తీర్ణంలో పొగాకు తోటలు పూర్తయినట్లు వర్జీనియా పొగాకు వేలం నిర్వహణ అధికారిణి గ్రేసి మార్గరెట్ తెలిపారు. మరో పదిహేను రోజుల్లో అదును బాగుంటుందని తోటలు వేయడం పూర్తి చేసుకోవాల్సిందిగా రైతులకు ఆమె సూచించారు. వచ్చే సీజన్‌కి 12.60 మిలియన్ల కేజీల పొగాకు ఉత్పత్తికి అనుమతులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

కౌలు ధరలూ పెరిగాయ్

గత సీజన్‌లో వర్జీనియా పొగాకు ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో ప్రస్తుతం కౌలు ధరలు సైతం పెరిగాయి. ఎకరం కౌలు రూ.60 వేల నుంచి రూ.లక్ష దాకా చేరింది. బేరన్, పెస్టిసైడ్స్, వ్యవసాయ కార్మికుల వేతనం.. ఇలా అన్ని వనరుల ధరలు అమాంతం పెరిగాయి. గత సీజన్లో కంటే ప్రస్తుత సీజన్లో ఎకరాకు రూ.40 నుంచి 60 వేల వరకు ఎక్కువ ఖర్చవుతున్నప్పటికీ వర్జీనియా సాగుకే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. పొగాకు ప్రత్యామ్నాయంగా పంటలు ఉన్నాయని వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు సమావేశాలు నిర్వహించినా కూడా రైతులు వర్జీనియాకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

ట్రే నారు ఉత్తమం

సాధారణ వ్యవసాయ క్షేత్రాల్లో పండించే నారు కంటే ట్రేనారు ఉత్తమమైనదని పాలిహౌస్‌లలో పండించిన నారును తోటలకు వేయాల్సిందిగా అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే వేలం కేంద్రం పరిధిలో ఉన్న అన్ని క్లస్టర్లలో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి ట్రే నారు పెంపకంపై, వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించినట్లు మార్గరెట్ తెలిపారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్తలతో పాటు బోర్డు అధికారులు తీసుకున్న చర్యల వలన గత సీజన్లో పురుగుమందు అవశేషాలు లేనటువంటి పొగాకు ఉత్పత్తి జరిగిందని, దానివల్ల కూడా గత సీజన్లో మద్దతు ధరలు లభించాయని చెబుతున్నారు. కర్ణాటకలో అమలవుతున్న పొగాకు కొనుగోళ్లలో నాణ్యమైన పొగాకుకి గతంలో కంటే రూ.30 నుంచి రూ.40 ఎక్కువగా వస్తున్నప్పటికీ లోగ్రేడ్ ధరలు రూ.50 నుంచి రూ.60కు పడిపోయాయన్నారు. కర్ణాటక మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని బోర్డు సూచించిన పరిమిత పంట మేరకే పండించాలని అధికారులు పేర్కొంటున్నారు.

ఫిబ్రవరిలో కొనుగోళ్లు ప్రారంభించాలి



గత సీజన్ ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆర్థికంగా బలపడ్డారు. దీంతో ఇరవై నుంచి ముప్పై రోజుల ముందుగానే సాగు పనులు మొదలెట్టారు. కాబట్టి 2025 ఫిబ్రవరి నెలలో వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ప్రారంభించేలా బోర్డు కృషి చేయాలి.

– కాకర్ల నంది, కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు

పరిమిత పంటతోనే ప్రయోజనం



అంతర్జాతీయ స్థాయిలో పొగాకు ధరలు పడిపోయాయి. కర్ణాటకలో అమలవుతున్న కొనుగోళ్లే అందుకు నిదర్శనం. పరిమిత పంటతోనే రైతులకు ప్రయోజనం. ఉత్పత్తి పంటలోని నికోటిన్ సాంద్రతను బట్టే మద్దతు ధర ఉంటుంది. పురుగు మందుల అవశేషాలు లేని పంటకే కొనుగోళ్లలో ప్రథమ ప్రాధాన్యత.

– గ్రేసీ మార్గరెట్, కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిణి

రంగాపురంలో సత్యదేవుని వ్రతాలు



రంగాపురంలో సత్యదేవుని వ్రతాలు జరుపుకుంటున్న భక్తులు

లింగపాలెం: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన రంగాపురంలోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సతీసమేతంగా సత్యవ్రతాలు జరుపుకున్నారు. ఆలయ గుమస్తా గోపి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు పారిజాతగిరిలో...

జంగారెడ్డిగూడెం: ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానములో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించబడునని ఈవో మానికల వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన పూజా ద్రవ్యాలు ఆలయ నిర్వాహకులే ఏర్పాటు చేస్తారన్నారు. పాల్గొనదలచిన భక్తులు 19వ తేదీ సాయంత్రంలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బౌద్ధారామాల వద్ద భక్తుల సందడి



గుంటుపల్లి బౌద్ధారామాల వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట: కార్తీక మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని కామవరపుకోట మండలం గుంటుపల్లి బౌద్ధారామాల వద్ద కొలువైయున్న ధర్మ లింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మూడో సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విద్యార్థులతో పాటు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించడం, దీపారాధన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొడ్రుముచ్చు గోపాల్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పర్యాటకులకు, భక్తులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు.

దళిత వాడలకు శ్రీవారి ధర్మప్రచార రథం



శ్రీవారి ధర్మప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ మూర్తి, తదితరులు

ద్వారకాతిరుమల: దళిత వాడలకు శ్రీవారి ధర్మప్రచార రథం సోమవారం పయనమైంది. ముందుగా అర్చకులు ఆలయం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చి జంటగోపురాల వద్ద ఉన్న ధర్మప్రచార రథంలో వేంచేపు చేసి, విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం కొబ్బరికాయలు కొట్టి రథ పర్యటనను ప్రారంభించారు. అనంతరం రథం బయల్దేరి జంగారెడ్డిగూడెం మండలానికి వెళ్లింది. అక్కడ 8 గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ధర్మప్రచారం పూర్తయిన తరువాత తిరిగి రథం క్షేత్రానికి చేరుకుంటుందని ఈఓ తెలిపారు.

ముక్కంటికి ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం హైస్కూల్ వద్ద శివయ్యకు అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి, అనంతరం ఈశ్వరుడికి అభిషేకాది పూజలు నిర్వహించారు. అశ్వారావుపేట రోడ్డులోని హైస్కూల్ పక్కన గల శ్రీ సర్వమంగళ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం నందు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వయంగా ఆవు పాలు, మంచినీటితో అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని బైనేరు వద్ద ఉన్న ఉమా సహిత రామలింగేశ్వరస్వామి, పేరంపేట రోడ్డులోని రాజరాజేశ్వర స్వామి, గుహాలయంలో ఓంకారేశ్వరస్వామి, పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో కొలువైన శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి వారికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. తాడవాయి వీరేశ్వరస్వామి, వేగవరంలో వేగిలింగేశ్వరస్వామి వారికి, లక్కవరం, పంగిడిగూడెం గ్రామాల్లో ఉన్న శైవక్షేత్రాల్లో స్వామి వార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

దూరవిద్య పరీక్షా కేంద్రం తనిఖీ

లింగపాలెం: ధర్మాజీగూడెం ప్రతిభ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య పరీక్షల నిర్వహణను వర్సిటీ ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్ సోమవారం పరిశీలించారు. ఇటీవల ఏఐఎస్ఎఫ్ పరీక్షల నిర్వహణపై యూనివర్సిటీకి ఫిర్యాదు చేయడంతో రామచంద్రన్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రతిభ కాలేజ్ డైరెక్టర్ సుజాతకుమారి విలేకరులకు తెలిపారు.

దివ్యమూర్తుల కల్యాణం.. కమనీయం



జంగారెడ్డిగూడెంలో శ్రీశ్రీనివాస శివ కార్తికేయ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో సోమవారం ఒకే వేదికపై ముగ్గురు దివ్యమూర్తుల కల్యాణం కమనీయంగా జరిగింది. లోక కల్యాణార్థం శ్రీశ్రీనివాస, శివ, కార్తికేయ స్వాముల కల్యాణోత్సవం వేదోక్తంగా నిర్వహించారు. నూకాలమ్మ ఆలయ ప్రధానార్చకులు, కొయ్యలగూడెం మండలం సీతంపేట శ్రీ రాజరాజేశ్వరీ త్రిశక్తి పీఠం వ్యవస్థాపకులు యర్రమిల్లి సాయి నరసింహ మనోజ్ శర్మ అవధాని ఆధ్వర్యంలో ఈ క్రతువు నిర్వహించారు. ఒకే వేదికపై శివ పార్వతులకు, భూదేవి, శ్రీదేవి సమేత శ్రీనివాసునికి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి జరిగిన కల్యాణ మహోత్సవాన్ని భక్తులు కన్నులారా వీక్షించి తరించారు. వీరంపాలెం శ్రీబాలా త్రిపుర సుందరీ పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశి కుమార్, అధ్యాత్మికవేత్త కనుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం లక్ష దీపోత్సవం నిర్వహించారు. దీప శోభమధ్య మంగళహారతి సమర్పించారు.

పలు గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు

చింతలపూడి: మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దేశావతు బాలుని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా పంతంగులగూడెంలో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని దారావతు బాబూరావుపై పరారీ కేసు నమోదు చేసినట్లు సీఐ పి అశోక్ తెలిపారు. తలార్లపల్లి గ్రామంలో సారా నిందితురాలు దేశావతు సైదాను అరెస్ట్ చేశారు, చింతలపూడి గురుభట్లగూడెం రోడ్డులో నాయుడు వెంకటేశ్వర్రావు, కొరిపల్లి శ్రీరామ్మూర్తిలను అరెస్ట్ చేసి వారి వద్ద 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే లింగపాలెం మండలం వెస్ట్ ఎడవల్లి గ్రామంలో ఈడా మధుసూదనరావు నుంచి 3 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. పంగిడిగూడెంలో ముప్పిడి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసి, 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బాల్య వివాహాలు నేరం

జంగారెడ్డిగూడెం: బాల్య వివాహాలు చట్టవ్యతిరేకమని, దీనికి ఎవరైనా పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని సీడీపీవో పి.బ్యూలా అన్నారు. బాల్యవివాహ నిరోధక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను, చట్టాల గురించి వివరించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తుంటే టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 112 నంబర్లలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.లక్ష్మి, హెచ్‌ఎం పి.ప్రశాంతి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, అంగన్‌వాడీ టీచర్‌లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

చింతలపూడి: అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం యర్రగుంటపల్లి సచివాలయం కార్యదర్శికి ఈమేరకు అర్జీలను అందజేశారు.

నిర్వాసితులపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

వేలేరుపాడు: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయ్ నగర్ గ్రామంలో సీపీఐ జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి బాడిశ రాము అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వేలేరుపాడు మండలంలోని జగన్నాథపురంలో ఇంటి విలువల విషయంలో ఎలాంటి కారణం చూపకుండా 140 మంది ఇండ్ల నిర్వాసితుల పేర్లు తొలగించిన అధికారిపై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. పోలవరం నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అర్హుల జాబితాపై ఇప్పటికీ స్పష్టత రాకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 10న తూర్పుగోదావరి జిల్లాలోని ఎటపాకలో నిర్వహిస్తున్న విలీన మండలాల నిర్వాసితుల మహాసదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం ధారయ, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదు

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు పనులపై ఉన్న శ్రద్ధ, ఆ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులపై ప్రభుత్వానికి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. కుక్కునూరులో సీపీఎం 8వ మండల మహాసభ సోమవారం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు పట్ల లక్ష్మయ్య ఆవిష్కరించారు. అనంతరం భయ్యాన శ్రీను, శ్యామల లక్ష్మణరావు, పట్ల సీతక్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవి మాట్లాడారు. సంవత్సరాలు తరబడి ప్రాజెక్టు కట్టడమేగాని నిర్వాసితుల సమస్యలు, పునరావాసం, పరిహారం గురించి చర్చే లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి, పూర్తి పునరావాసం కల్పించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు సాగించాలని అన్నారు.

నలుగురిపై కేసు నమోదు

కామవరపుకోట: వెంకటాపురంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. ఈ దాడుల్లో నిందితుల నుంచి రూ.4500 నగదు స్వాధీన పరుచుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు, చెప్పారు. అలాగే తడికలపూడిలో మోటార్ సైకిల్‌పై అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులో తీసుకుని, అతని వద్ద నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో రెండిళ్ల మధ్య సరిహద్దు తగాదా ఘర్షణకు దారి తీసింది. గద్దే శ్రీను అనే వ్యక్తి, పక్కింట్లో ఉంటున్న తెల్లం వెంకటేశ్వరరావుపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వరరావును పోలవరం వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎన్ పవన్‌కుమార్ తెలిపారు.

తగరం కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

జంగారెడ్డిగూడెం: పామాయిల్ కార్మికుడు తగరం కళ్యాణ్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని డీవైఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ సమావేశంలో జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తగరం కళ్యాణ్ సోమవారం పామాయిల్ గెలలు కోసేందుకు పనికి వెళ్లి అక్కడ విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందాడన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కళ్యాణ్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏ.ప్రభాకరరావు, ఎస్.నాని, ఆశీర్వాదం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

లూయిస్ డాగురే జయంతి

టి.నరసాపురం: లూయిస్ డాగురే జయంతిని సోమవారం టి.నరసాపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం లింగస్వామి డాగురే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మధుర స్మృతులను ఫొటోల రూపంలో బంధించి తరాతరాలకు అందించేందుకు కారణమైన వ్యక్తి లూయిస్ డాగురే అని కొనియాడారు. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్‌లో వృద్ధులకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

జంగారెడ్డిగూడెం: అనారోగ్యంతో బాధపడుతున్న 20 మంది పిల్లలకు జంగారెడ్డిగూడెం రావిచర్ల ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ అండ్‌సొసైటీ (ఆర్ఐడీఈఎస్), లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు అందజేశారు. లయన్స్‌క్లబ్ చైర్మన్ నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ క్యాబినేట్ మెంబర్ సీతారామ్, లయన్స్ సభ్యులు హనుమంతరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం మంగపతిదేవిపేట, రాజవరం, యర్రంపేట గ్రామాలలో గ్రామ పంచాయతీల వద్ద సీపీఐ నాయకులు పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు.

21, 22 తేదీల్లో క్రైస్తవ సమావేశాలు

కొయ్యలగూడెం: ఈనెల 21, 22 తేదీల్లో కొయ్యలగూడెంలోని క్రిస్టియన్ ఫెలోషిప్ ప్రార్థన మందిరం క్రైస్తవ సమావేశాలు (ప్రత్యేక కూడికలు) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశాలకు దైవ వర్తమానికులు మంజిత్ పాల్ హాజరవుతున్నారని, క్రీస్తు విశ్వాసులు పాల్గొనాలని కోరారు.